


(గత సంచిక తరువాయి)

**7**

వకుళ ఒక్కత్తే నిద్రపోతోంది.

ఉన్నట్లుండి యెవరో వళ్లంతా తడుముతున్నట్లు అని-
పించిందామెకు. ముందు శరీరానికి గిలిగింతలు పెట్టినట్లు

మత్తుగా ఊరుకుంది. కానీ తర్వాత ఏదోలా అనిపించి ఉలిక్కిపడి లేచింది.

"ఉష్-నేను కోదండాన్ని-"

"ముందు నువ్వు బయటకు వెళ్ళు!" అంది వకుళ.

"వెళ్ళను...."

"అయితే గట్టిగా అరుస్తాను...."

చటుక్కున కోదండం ఆమె నోరు నొక్కేసి "ఎలా అరుస్తావో చూస్తాను" అన్నాడు.

వకుళ గిలగిలా తన్నుకుంటోంది. అతగాడామెకు బట్టలు విప్పేస్తున్నాడు.

వకుళ సర్వశక్తులూ క్రోడీకరించుకుని పెనగులాడుతోంది. కోదండం పశుబలంతో వ్యవహరిస్తున్నాడు.

వకుళ వివస్త్ర అయింది. తన సర్వశక్తులూ నాశన మైనట్లు భావిస్తోందామె.

అమావాస్య ఇంకా నాలుగురోజులుంది. ఇంతలో ఈ అవాంతరం.

కోదండం వకుళను వదిలిపెట్టి "ఇప్పుడరవ్వే చూస్తాను" అన్నాడు.

వకుళ అరవలేదు. అరిస్తే ఇంట్లో వాళ్ళెవరూ తనను రక్షించరు. ఆ అలుసు చూసుకునే కోదండం ఇటుగా వచ్చాడు. తను బయటివాళ్ళ కోసం అరవాలి. ఈ రూపంతో తను బయటివాళ్ళ కళ్ళబడదల్చుకోలేదు. కోదండానికి బలంతోపాటు తెలివితేటలు కూడా ఉన్నాయి.

చీకట్లో వకుళ - కోదండం ఒకరికొకరు ఎదురుగా ఉన్నారు. అవమానంతో కోపంతో బుసలు కొడుతున్నది వకుళ. కామంతో బుసలు కొడుతున్నాడు కోదండం. అతనామెను బలంగా కౌగలించుకున్నాడు.

ఆ కౌగిలి వకుళకు జుగుప్సాకరంగా ఉన్నది—
"కోదండం-నేను చెప్పింది .. మరిచిపోయేవా? కొద్ది రోజులు నన్ను వదల్లేవా?"

"నిన్ను వదల్లేను నేను. అలాగని నీకన్యాయమూ చేయను. నిన్ను నేను తప్పక పెళ్ళిచేసుకుంటాను...."

"పెళ్ళి చేసుకునేదాకా కాస్త దూరంగా ఉండలేవా?"

కోదండం నవ్వాడు "నీ ఎత్తులన్నీ నాకు తెలుసు. వీలుచూసుకుని ఆ మధుగాడితో లేచిపోదామనుకుంటున్నావ్. నిన్ను పెళ్ళి చేసుకోవాలంటే యిలా లొంగదీసుకోవడమొక్కటే మార్గమని శారదక్క చెప్పింది."

వకుళ చలించిపోయింది. ఛీఛీ అనుకుందామె. ఆఖరికి పిన్ని ఇంత నీచానికి దిగిందా? తను ఆడదై ఉండీ ఒక మగాణ్ణి మరో ఆడదాన్ని చెరచమని పురమాయిస్తుందా?

"పిన్నీ-నీ పని అయిపోయింది. నిన్ను... నిన్ను...." ఆవేశంతో ఆమెకు మాటలు రాలేదు.

కోదండం ఆమెను ఏమేమో చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. అతడి చేష్టలామెకు ఎంతో జుగుప్సాకరంగా ఉన్నాయి. కానీ ఆమె అతణ్ణి ప్రతిఘటించలేక పోతోంది. కోదండం ఆమెను మంచం వైపుగా నడిపిస్తున్నాడు.

ప్రతి అడుగూ భారంగా వేస్తోంది వకుళ.

ఒకటి.... రెండు.... మూడు.... నాలుగు....

అమావాస్యకు సరిగ్గా నాలుగురోజులు.

అప్పుడే కాలికి ఏదో తగిలి ఇద్దరూ కిందపడ్డారు.

కాలికి తగిలిందేమిటో వకుళ గుర్తుపట్టింది. ఆమెబుద్ధి చురుగ్గా పనిచేసింది. పడిపోగానే చేతుల్లో రోకలిబండను అందుకుంది. గోడకు మేకులు కొట్టాక అది ఇందాక తనే అక్కడ మర్చిపోయింది. ఇప్పుడది ఇంకోలా పనికొస్తోంది.

వకుళ ఆ బండను అందుకుని శరవేగంతో లేచి— కోదండం లేచేలోగా గురిచూసి అతడి తలమీద గట్టిగా బాదింది.

సరిగ్గా ఒక్కటే దెబ్బ—"అయ్యో!" అని తల పట్టుకుని పడిపోయాడు కోదండం.

చీకట్లో వకుళ కళ్ళు బాగానే కనబడుతున్నాయి.

ఆమె పరుగున వెళ్ళి బట్టలు కట్టుకుంటోంది.

కోదండం కేక గట్టిగానే పెట్టాడు. చుట్టుపక్కల వాళ్ళు కాకపోయినా ఇంట్లో వాళ్ళు లేచి వచ్చారు.

రక్తపుమడుగులో ఉన్న తమ్ముణ్ని చూసి శారద— "తమ్ముడూ!" అని బిగ్గరగా అరచింది.

ఈలోగా అక్కడికి వకుళ వచ్చింది.

"ఏం జరిగిందే?" అంది శారద తీవ్రంగా.

"దొంగ కాబోలు—" అంది వకుళ చాలా నెమ్మదిగా.

జోగారావు అప్పటికప్పుడు డాక్టర్ని పిల్చుకుని వచ్చాడు—"దెబ్బ బలంగా తగిలింది. బ్రతకడం కష్టం- పోలీసు రిపోర్టిస్తారా?" అనడిగాడు డాక్టరు.

జోగారావుకు పోలీసులంటే భయం. పోలీసుల ప్రసక్తి లేకుండా వైద్యం చేయమని డాక్టర్ని కోరాడతను.

కోదండం చావు బ్రతుకుల్లో ఉండగా శారద వకుళని నిలదీసింది.

వకుళ నిర్భయంగా నేరం ఒప్పుకుంది—"నువ్వే వాణ్ని నామీదకు ఉసిగొల్పావు. వేరే దారి లేక వాణ్ని

కొట్టాను—"

"కొట్టడం కాదు—చంపేశావు. రేపొద్దున వాడు చచ్చిపోతే పోలీసులు నిన్ను హంతకురాలంటారు. ఉరి తీస్తారు. ఆ విషయం తెలుసా?"

వకుళ నవ్వి—"పిన్నీ! ఒక హత్య చేసినా రెండు హత్యలు చేసినా మూడు చేసినా నాలుగు చేసినా హంతకురాలి పేరు మారదు. హంతకురాలిగానే ఉండి పోతుంది. నేను ఉరికంబం ఎక్కితే ఒక హత్యకు ఎక్కాను...." అంది. ఆమె నవ్వు మామూలుగా లేదు.

శారద భయపడింది. అయినా బింకంగా—"నీ నేరానికి ఋజువులేదనుకోకు. కోదండానికి తెలివి వస్తే నీ గురించి చెప్పేస్తాడు. అప్పుడు నీ బ్రతుకు జైలుపాలవు తుంది—" అంది.

"ఇంటికన్నా జైలే నయం—" అని నవ్వింది వకుళ- "పిన్నీ! మనిషిని కొట్టిన నేరానికి జైల్లో వేసిన మనిషి జైలునుంచి తిరిగి రావడం కూడా ఉంటుంది. అలా వచ్చిన మనిషికి మళ్ళీ జైలుకెళ్ళాలంటే భయం కూడా ఉండదు—"

"బెదిరిస్తున్నావా?" అంది శారద.

"ప్రతి మనిషికీ మంచిరోజులుంటాయి. నాకూ మంచి రోజులు వస్తున్నాయి. అందుకే కోదండాన్ని నేను కొట్టగలిగాను—" అంది వకుళ. వకుళ అలాగనడానికి కారణముంది. కోదండం ఆ రాత్రి తన వంటిమీద చేయి వేయగానే—తన పని అయిపోయిందనుకుందామె. తన్ను తాను కాపాడుకొనగలనన్న ధైర్యం ఆమెలో ఏ కోశానా లేదు.

కోదండం చావలేదు. బ్రతికాడు. కానీ మంచంమీద

మూడు వారాలున్నాడు.

ఈలోగా వకుళ అఖురిజపం అయిపోయింది. ఆ రోజున ఆమె ఆనందం వర్ణనాతీతం.

ఒక్క రాత్రి హాల్లో లైటు వేసుకుని పిచ్చిగా గెంతులు వేస్తూ నృత్యం చేయసాగిందామె. కాస్సేపయ్యాక పాటలు కూడా ప్రారంభించిందామె. మధ్యలో అదో రకంగా నవ్వులు.

ఆమె అలా నవ్వుకుంటూ నృత్యం చేస్తూంటే శారదకు మెలకువ వచ్చింది. ఆమె లేచి హాల్లోని దృశ్యంచూసి హడిలిపోయి—కెవ్వుమని కేక వేసింది.

వకుళ నృత్యం పిశాచ నృత్యంలా వుంది.

శారద కేకవిని వకుళ ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి పిన్నిని చూసి తడబడి నృత్యం ఆపివేసింది.

శారద ఇంకా వణుకుతూనే ఉన్నది. ఈలోగా అక్కడికి జోగారావు వచ్చాడు—"ఏం జరిగింది?"

"వకుళ పిచ్చిపిచ్చిగా నవ్వుతూ, గెంతులు వేస్తూంటే చూశాను. ఆ దృశ్యం ఎంత భయంకరంగా ఉందో చూ సేగానీ తెలియదు—" అంది శారద.

వకుళ మడత మంచం వాల్చుకుని మాట్లాడకుండా పడుకున్నది.

జోగారావు భార్యను తీసుకుని వెళ్ళిపోయాడు.

వకుళ ఇప్పుడు తన తొలి ప్రయోగం గురించి ఆలోచిస్తోంది. అందుకు ఎవర్నెన్నుకోవాలి? అది హితుల పైనా సన్నిహితుల పైనా ప్రయోగించాలని చెప్పాడు సాధువు. తనకలాంటి వారెవరున్నారు?

మధు....అతడే తన ఆశాకిరణం....

"సార్!" అన్నాడు లింగం.

మహాదేవుడు ఒకసారి వొర్లి అటుతిరిగి పడుకున్నాడు.

"సార్ — మిమ్మల్నే...." లింగం మహాదేవుణ్ణి కుదిపాడు.

"ఊఁ" అని మూలిగాడు మహాదేవుడు.

"ద్రావకం రంగు మారింది సార్!" అన్నాడు లింగం.

"ఏమిటీ?" ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు మహాదేవుడు.

"ద్రావకం రంగు మారింది సార్!" మళ్ళీ అన్నాడు లింగం.

మహాదేవుడు మంచంమీంచి దిగి లేచి నిలబడి లాబరేటరీలోకి పరుగెత్తాడు. లింగం ఆయన్ననుసరించాడు.

మహాదేవుడు ఆత్రుతగా రంగుమారిన ద్రావకాన్నే చూస్తున్నాడు. ఆయన కళ్ళు మెరుస్తున్నాయి. ఈ ప్రపంచాన్ని జయించిన ఆనందం ఆయన కళ్ళలో కనబడుతోంది.

"ఇప్పుడు వివరాలు చెప్పు!" అన్నాడాయన. లింగం ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు.

సంతోషమే మరి!

శవాల్లో చైతన్యం కలిగించడం కోసం పరిశోధనలు మొదలుపెట్టి ఎలుకలమీద కొన్ని పరీక్షలు జరిపాడు ప్రొఫెసర్. వాటి ఆధారంగా ఓ మందు ఫార్ములా తయారు చేశాడు. అందుకు ఎన్నో మిశ్రమాలు పరిశీలించాడు. అలాంటి అనేక మిశ్రమాలలో ఒకటి ఎలుకలపై తన ప్రభావాన్ని చూపించింది. (ఇంకా వుంది)